
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 29 అక్టోబరు 2024





హోరాహోరీగా..
● రెండోరోజు ఉత్కంఠగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు
6



టీడీపీ సభ్యత్వం.. ఓ భరోసా

దివంగత నందమూరి తారకరామారావు టీడీపీని స్థాపించినప్పటి నుంచి పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కట్టుబానిసలుగా పనిచేసే క్యాడర్ ఉంది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు దాకా.. వారే పార్టీకి బలం. వీరంతా అచ్చంగా పార్టీ కోసమే పనిచేస్తుంటారు. టీడీపీ కూడా ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసమే కాదు.. సొంత పసుపు సైనికుల సంక్షేమానికి కూడా పాటుపడుతోంది. ఈసారి పార్టీ కేడరు కోసం రూ.5లక్షలు ప్రమాద బీమాను తీసుకువచ్చింది. ఇది పార్టీ కేడరుకేకాదు.. ఓటు హక్కుఉన్న ప్రతి ఒక్కరూ రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ఆ కుటుంబానికి భరోసాగా ఉంటుంది. 2024-26 రెండేళ్ల కాలపరిమితితో టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈసారి 5లక్షల సభ్యత్వాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- రూ.100 సభ్యత్వంతో రూ.5లక్షల ప్రమాద బీమా
- సాధారణ మరణం జరిగితే అంత్యక్రియలకు రూ.10వేలు
- 5లక్షల సభ్యత్వమే టార్గెట్
- పార్టీ కేడర్ సంక్షేమం కోసం టీడీపీ పెద్దపీట
- డిసెంబరు 31 వరకు సభ్యత్వ నమోదు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ అంటేనే బీసీ ఇతర అణగారిన వర్గాల పార్టీగా గుర్తింపు ఉంది. సంక్షేమం అభివృద్ధి పథకాల్లో ఆ పార్టీ ట్రాక్ రికార్డును ఇంతవరకు ఎవరూ చేరుకోలేదు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉంది. సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో నడిపిస్తారన్న పేరుంది. ఇక ఎన్నికల హామీలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. టీడీపీ కేడరు సాహసోపేతమైన కృషితోనే ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చింది. అందుకే సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ పార్టీ కేడరు సంక్షేమంపై దృష్టి పెట్టారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు శ్రీకారం చుట్టారు. 2024-2026 సంవత్సరాకు సభ్యత్వ నమోదును మొదలెట్టారు. ఈసారి రూ.100 కట్టి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమాను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచారు. సభ్యత్వం తీసుకున్న ఎవరైనా సరే ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల బీమా కల్పిస్తారు. అంతేకాకుండా ఆ కుటుంబం బాధ్యతను కూడా పార్టీనే తీసుకుంటుంది. సాధారణ మరణం అయితే అంత్యక్రియలకు రూ.10వేలు అందిస్తారు. ఇది ఈసారి కొత్తగా ప్రవేశపెట్టారు. సభ్యత్వాన్ని కేవలం టీడీపీ కేడరే చేసుకోవాల్సి అవసరంలేదు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వాట్సప్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు ఐడీ, ఇతర వివరాలను నమోదు చేసి వంద రూపాయలు రుసుం చెల్లించాలి. వెంటనే సభ్యత్వం నమోదవుతుంది. దీంతో ఇప్పుడు టీడీపీ కార్యకర్తలంతా జోష్‌మీదున్నారు.

జిల్లాలో ఐదు లక్షలు టార్గెట్

సభ్యత్వ నమోదును టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి జిల్లాలో కూడా ఐదు లక్షల మందికి సభ్యత్వం కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సుమారు 3 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీస్థానాలు ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 70 నుంచి 75వేలు టార్గెట్ పెట్టుకున్నారు. వంద రూపాయలకే రూ.5లక్షల ప్రమాద బీమా, సాధారణ మరణానికి అంత్యక్రియలకు పదివేలు వస్తుండడంతో కొందరు ఎమ్మెల్యేలే తమ క్యాడరంతటికీ డబ్బులు కట్టి సభ్యత్వం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. రూ.5లక్షల ప్రమాద బీమా జనాల్లోకి బాగా వెళ్లింది. ఎవరి సిఫారసు లేకుండా వాట్సప్ ద్వారా సభ్యత్వం తీసుకునే అవకాశం ఉండడంతో టీడీపీనే కాదు ఇతరులు కూడా సభ్యత్వంపై మొగ్గు చూపుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లావ్యాప్తంగా సభ్యత్వం ప్రారంభమైంది. టీడీపీనే అధికారంలో ఉండడంతో పెద్దసంఖ్యలో సభ్యత్వం నమోదు అవుతుందని భావిస్తున్నారు. ఇక శాశ్వత సభ్యత్వం లక్ష రూపాయలుగా నిర్ణయించారు. జిల్లాలో తొలిసారిగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి చంద్రబాబు సమక్షంలో లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి కూడా లక్ష చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు.




సీకేదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెలో సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తలు

టీడీపీ సభ్యత్వం కుటుంబానికి రక్ష

తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తీసుకోవచ్చు. వాట్సప్, ఆన్‌లైన్‌లోనే తీసుకుని డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా చెల్లింపులు చేయవచ్చు. ఇది ప్రతి కుటుంబానికి రక్షణ లాంటిది. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబం వీధినపడుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోండి. ప్రజల సంక్షేమమే కాదు కేడరు సంక్షేమం కోసం టీడీపీ చూస్తోంది.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు



ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

● అడ్మిషన్ క్యాన్సిల్ చేస్తాం
● రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ



ముఖాముఖి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్)లో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ర్యాగింగ్ భూతం తమ కళాశాలలో ఉండదని తెలిపారు. ర్యాగింగ్ అరికట్టడంలో తమ సిబ్బంది చురుగ్గా ఉన్నారన్నారు. ఈ మేరకు ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : ర్యాగింగ్ జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: నూతన విద్యార్థులను హాస్టల్స్‌లో సీనియర్ విద్యార్థులతో కలవకుండా ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేశాం. ఫ్యాకల్టీ వైద్యులు ప్రతిరోజూ పర్యవేక్షణ జరుపుతూ గస్తీ చేస్తుంటారు.

ప్రశ్న : ర్యాగింగ్ గురించి అవగాహన కార్యక్రమాలు..

జవాబు: ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే అనర్థాలు, శిక్షలను కళాశాలలో, హాస్టల్స్‌లో బ్యానర్ల రూపంలో డిస్‌ప్లే పెట్టాం. పోలీసు, న్యాయవిభాగ అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : నూతన విద్యార్థులకు భరోసా ఎలా ఇస్తున్నారు

జవాబు: యాంటి ర్యాగింగ్ కమటీ మెంబర్ల పేర్లు, ఫోను నెంబర్లను బ్యానర్లు వేసి డిస్‌ప్లే పెట్టాం. యాంటి ర్యాగింగ్ కమిటీ మెంబర్లు, నేను, వార్డెన్స్ సర్‌ప్రైజ్ విజిట్ చేస్తుంటాం.

ప్రశ్న : సీనియర్ విద్యార్థులకు అవగాహన ఎలా కల్పిస్తారు

జవాబు: కొత్తవిద్యార్థులు చేరినప్పటి నుంచి మొదటి మూడు నెలలు అవేర్‌నెస్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నాం. ర్యాగింగ్ చేస్తే భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : ర్యాగింగ్ చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రాథమికంగా విచారిస్తాం. తరువాత ఎంక్వయిరీ కమిటీని వేస్తాం. ర్యాగింగ్ జరిగినట్లు నిరూపణ అయితే డీఎంఈ సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ర్యాగింగ్ తీవ్రత అధికంగా ఉంటే అడ్మిషన్‌ను క్యాన్సిల్ చేస్తాం. పోలీసు డిపార్ట్‌మెంటు వారికి చెప్పి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ఉల్లి రైతులను తక్షణం ఆదుకోవాలి

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన కమలాపురం నియోజకవర్గం తంగేడుపల్లె గ్రామం ప్రకృతినగర్ వద్ద ఉల్లిగడ్డ రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులు ఎకరాకు లక్ష రూపాయల నుంచి రూ.1.20లక్షల వరకు ఖర్చుచేశారని, పంట కూడా బాగానే పండిందని దురదృష్టవశాత్తు కొనేనాథుడే లేడన్నారు. పచ్చి సరుకు కాబట్టి నిల్వచేసుకునే అవకాశాలు లేవని ఏం చేయాలో దిక్కుతోచక రైతులు లబోదిబోమంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగి క్వింటాల్‌కు రూ.3000 చొప్పున రైతుల నుంచి ఉల్లి గడ్డలు కొనాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులతో తులసిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు.



రైతులతో మాట్లాడి ఉల్లిదిగుబడులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

అర్జీదారుల సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్నిశాఖల అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. బద్వేలు మండలం చెన్నాయపల్లెకు చెందిన కొండమ్మ తమ ఇల్లు ఎన్‌హెచ్‌రోడ్డు విస్తరణలో కోల్పోయామని నష్టపరిహారం అందించాలని కోరారు. అట్లూరు మండలం వేమలూరుకు చెందిన యరికలయ్య తన ఆధీనంలో ఉన్న భూమికి సంబధించి పట్టాదారు పాస్‌పుస్తకం వరదల్లో పోయిందని కొత్తది ఇవ్వాలంటూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లకు నేటి నుంచి బుకింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని, మంగళవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. రాష్ట్రంలో క్రియాశీల ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ నెంబరు, తెల్లరేషన్ కార్డు అర్హతలతో పాటు బ్యాంకుకు ఆధార్ లింక్ అయి ఉండాలన్నారు. వీరు దీపం-2 పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు సంవత్సరానికి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు 3 ఉచితంగా పొందేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయన్నారు. ఈ దీపం-2 స్కీంలో ఈనెల 31వ తేదీ గురువారం నుంచి మార్చి నెల 25వ తేదీవరకు అంటే 5 నెలలలోపు మొదటి సిలిండర్, వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 31 లోపు రెండవ సిలిండర్, ఆగస్టు 1 నుంచి నవంబరు 31 వరకు మూడవ సిలిండర్ ఉచితంగా పొందవచ్చన్నారు. మొదటి గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన 48 గంటల్లోగా ఇంటికి డోర్ డెలివరీ అవుతుందన్నారు. లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించి సిలిండర్ పొందాలని, డెలివరీ అయిన 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బు జమ అవుతుందన్నారు. ఈ స్కీంలో ఉచిత సిలిండర్ పొందాలనుకున్న లబ్ధిదారులు మంగళవారం నుంచి మార్చి నెల 25 వరకు బుకింగ్ చేసుకుని మొదటి సిలిండర్ పొందవచ్చన్నారు. ఫిర్యాదులు, సలహాలు ఇవ్వదలచిన వారు టోల్‌ఫ్రీ నెంబరు 1967కు తెలపాలన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
● పోలీసులకు ఉచిత మెగా మెడికల్ క్యాంపు



పోలీసుల రక్తదానం శిబిరం వద్ద ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధుల్లో తలమునకలై ఉండే పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని ఉమేశ్‌చంద్ర స్మారక పోలీసు కళ్యాణమండపంలో పోలీసు, హోంగార్డు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో అరుణాచల, శ్రీశ్రీ హోలిస్టిక్, రిమ్స్‌వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరువీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీసు సంస్మరణ వారోత్సవాలను అక్టోబరు 21 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపును పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేశామన్నారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, వారి డ్యూటీ సమయాలు కూడా చాలా భిన్నంగా ఉంటాయని, ఆహారం కూడా సమయానికి తీసుకోలేని పరిస్థితులు ఉంటాయని అన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ఇక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సందర్శించారు. రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదాతలు అవుతారన్నారు. ఉచిత వైద్యశిబిరానికి విచ్చేసి వైద్య సేవలు అందించిన వైద్యులకు ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రమణయ్య, ఏఆర్ ఎస్పీ మురళీధర్, పోలీసుసంక్షేమ వైద్యశాల యూనిట్ వైద్యురాలు డాక్టర్ మేరీసుజాత, డీపీవో ఏవో జ్యోతి, ఆర్‌ఐలు టైటస్, ఆనంద్, వీరేశ్, సీఐలు వెంకటకుమార్, హేమకుమార్, భాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ, తేజోమూర్తి, రిమ్స్ బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, సంధ్య, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులసంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, స్టేట్ కో ఆప్షన్ మెంబరు మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనిఎస్పీ హర్షవర్ధన్ రాజు సిబ్బందిని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదుల ు స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.

మున్సిపాలిటీలో అవినీతి చీడ

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి పట్టిన అవినీతి చీడ వదిలేటట్లు లేదు. కొన్ని సెక్షన్లలో ఉద్యోగులు లంచాల అలవాటు మానుకోవడం లేదు. ఎందరు కమిషనర్లు మారుతున్నా ఎమ్మెల్యేలు మారుతున్నా.. కార్యాలయంలో మీటింగ్‌లు పెట్టి బహిరంగంగా అవినీతిపై హెచ్చరించినా కొందరి తీరులో ఏమాత్రం మార్పు రావడంలేదు. నిన్నటి వరకు టౌన్‌ప్లానింగ్‌లో ఒక అవినీతి అనకొండ ఉండటంతో ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో అయనపైనే పెద్ద ఎత్తున చర్చ సాగింది. ఆ అవినీతి అనకొండ బదిలీపై వెళ్లిపోయారు.

● పైసలియ్యందే పనిచేయని ఉద్యోగులు ● చేతివాటం ప్రదర్శించి వెళ్లిన కీలక అధికారి
● కొత్త కమిషనర్ చర్యలు తీసుకునేనా

ప్రొద్దుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మొన్నటి వరకు ఉండి బదిలీపై వెళ్లిన ఒక కీలక ఉన్నతాధికారి సైతం.. ఉన్న కొన్ని నెలల్లోనే చేతివాటం ప్రదర్శించా రని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బిల్లులకు తాను కోరినంత కమీషన్ ఇవ్వందే సంతకాలు పెట్టలేదని కొందరు తెలిపారు. అలాగే కొన్ని అక్రమ కట్టడాలలో సైతం కమీషన్లు గుంజినట్లు సమాచారం.

దీనికితోడు రెండుసార్లు ఏసీబీకి దొరికిన ఓ అధికారి ఇటీవల ఇక్కడి ఒక సెక్షన్‌కు రీపోస్టింగ్ మీద వచ్చాడు. ఆయన వచ్చినప్పటి నుంచి ఆ సెక్షన్‌లో ఉన్న సిబ్బంది ఇతర అధికారులందరు అవినీతిపరులంటూ ప్రచారం చేయడంతో పాటు వారందరిని మార్చాలని ఫిర్యాదులు చేస్తున్నారు. ఆయన మామూళ్ల వసూలు తను పనిచేసే సెక్షన్‌లో తెలియకుండా ఉండేందుకు నేరుగా పార్టీలతో ఆయన సంబంధాలు నెరుపుతూ బయటి వ్యక్తిని మామూళ్లు రాబట్టడానికి నియమించుకున్నాడు. అతను అప్పుడప్పుడు కార్యాలయానికి వస్తున్నాడు. గతంలో సమస్య ఉండి పన్నువేయని ప్రైవేటు వాణిజ్యగదులకు పన్నులు వేసి అందులో భారీగా గుంజినట్లు ప్రచారం సాగుతోంది.

అలాగే మున్సిపాలిటీలో ఒక సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉండి ఇటీవల కొంతకాలంగా వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన సీటు చూస్తున్న అధికారి ఉన్నారు. గతంలో ఉన్న మహిళా ఉద్యోగి ఆ సీటు చూసినంత కాలం ఆ సెక్షన్‌లో ఎలాంటి ఆరోపణలు రాలేదు. కానీ ఇతను వచ్చినప్పటి నుంచి సచివాలయ ఉద్యోగుల బదిలీలు, సెలవులు, ఇంక్రిమెంట్లు తదితర పనులకు రేటు ఫిక్స్‌చేసి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఒక వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ బదిలీపై వస్తే ఆమెకు సంబంధించి సెలవుల జీతం చేయడానికి భారీగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఆమె తెలిసిన వాళ్లతో చెప్పితే ఆయన రేటు తగ్గించాడే తప్ప వసూలు అయితే చేశాడని వాపోయారు. అతను గతంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఉండి అవినీతికి అలవాటు పడి ఇక్కడ ఈ సెక్షన్‌లో అదే తీరులో సచివాలయ ఉద్యోగులతో వ్యవహరిస్తున్నాడు.

ఇటీవల బదిలీలలో సచివాలయ ఉద్యోగులకు సాలరీ సర్టిఫికేట్, ఎస్సార్ తదితర పత్రాలు అందజేయడానికి రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నాడని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగుకు వెళ్లిన శానిటరీ సెక్రటరీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నా పత్రాలు ఇవ్వలేదని.. చివరికి అడిగినంత డబ్బులు ఇచ్చాకే సాలరీ సర్టిఫికేట్, ఎస్ఆర్ ఇచ్చారని చెబుతున్నారు. అంతేకాకుండా వార్డు మహిళా కార్యదర్శులకు ఇంక్రిమెంట్లను వేతనంలో కలపడానికి ఒక్కొక్కరి నుంచి రూ.600 డిమాండ్ చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వలేదని నేటికి వారికి ఇంక్రిమెంట్లు కలపలేదని వాపోతున్నారు. ఈ సమస్యపై గత కమిషనర్ రఘునాథరెడ్డికి చెప్పినా ఆయన మందలించి వదిలేశారు తప్ప అతనిపై చర్యలు తీసుకోలేదని వెల్లడిస్తున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ మల్లికార్జున మున్సిపాలిటీని వదలనంటున్న అవినీతి చీడను వదిలిస్తాడా.. లేక ఆయన చూసీచూడనట్లు వ్యవహరిస్తారా అనే చర్చ జరుగుతోంది.

కార్యాలయంలో ప్రక్షాళన ప్రారంభించా..

ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రక్షాళన ప్రారంభించాను. అన్ని సెక్షన్లలో నిర్లక్ష్యం ఉంది. కొందరు ఉద్యోగుల చేతివాటంపై కూడా ఫిర్యాదులు అందాయి. అలాంటి వారికి ప్రత్యేకంగా హెచ్చరించాము. కానీ వారిలో మార్పురాకుంటే చర్యలు తప్పవు. ఆరోపణలున్న కొందని సీట్లు సైతం మార్చాం అక్కడా అదే తీరులో వ్యవహరిస్తే నేరుగా ఇంటికే పంపిస్తానని కూడా వార్నింగ్ ఇచ్చాం. మార్పుకోసం కృషి చేస్తున్నాం. కొద్ది నెలల్లో అది ఆశించవచ్చు.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

పనిముట్లు ఇవ్వకుండానే పనిచేయమంటున్నారు

● మున్సిపల్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న ప్రొద్దుటూరు కమిషనర్ మల్లికార్జున



ప్రొద్దుటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పనిముట్లు ఇవ్వకుండానే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మేస్త్రీలు పనిచేయమంటున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం ఆరోపించారు. సోమవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ కార్మికులకు పుష్‌కాట్ కానీ వీల్ బార్‌లు కాని ఇవ్వడం లేదన్నారు. చీపుర్లు డోటీలు సైతం లేకుండా కార్మికులు ఎలా పారిశుధ్య పనులు చేస్తారని ప్రశ్నించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మేస్త్రీలు వర్కర్లను ఘోరంగా చూస్తున్నారన్నారు. చెప్పులు రెండుసార్లు మంజూరు చేసినా నేటికి ఇవ్వలేదన్నారు. బట్టలు సైతం అందలేదన్నారు. ఎఫ్ సెక్షన్‌లో కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపించారు. చనిపోయిన కార్మికులకు బెనిఫిట్స్ కూడా మూడేళ్లుగా అందలేదన్నారు. ఫైలు కదలాలంటే 5వేలు 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు కార్మికులు ఆరోపించారు. వీటన్నింటిపై కమిషనర్ మల్లికార్జున స్పందించారు. డబ్బులు డిమాండ్ చేసేవాళ్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు అందాల్సిన అన్ని పనిముట్లు త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి కార్యదర్శి సాల్మన్, గుర్రమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- రెండవరోజు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లు
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు
- దాతల సహకారంతో క్రీడాకారులకు భోజన వసతి



కబడ్డీ ఆడుతున్న చిత్తూరు- నెల్లూరు బాలికల జట్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల్లో క్రీడా పోటీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంత్రి సొంత నియోజకవర్గమైన రాయచోటి పట్టణంలో ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంతల పర్యవేక్షణలో, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఆర్గనైజర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వాహకులు నరసరాజు, రెడ్డయ్య, జగదీశ్వరయ్య, వేణుమాధవరాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ క్రీడా పోటీలను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 20 జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద ఎత్తున మైదానానికి చేరుకొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాలబాలికల క్రీడాకారులకు దాతల సహకారంతో భోజన వసతి సౌకర్యాలను అత్యంత పకడ్బందీగా కల్పిస్తున్నారు. క్రీడాకారులకు పట్టణంలోని పలు పాఠశాలల్లో భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రెండవ రోజు విజేతలు వీరే

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రెండవ రోజు పలు జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచారు. క్రీడా పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో మొదటగా వైజాగ్- ప్రకాశం జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు 22 పాయింట్లతో విజేతగా నిలిచింది. అలాగే శ్రీకాకుళం- వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్లతో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు విజయం సాధించగా, పశ్చిమగోదావరి- అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 25 పాయింట్లు అనంతపురం జట్టు గెలుపొందగా కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5 పాయింట్లతో కర్నూలు జట్టు విజయం సాధించింది. అలాగే ఈస్ట్ గోదావరి- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 పాయింట్ల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించగా, విశాఖపట్నం- వైఎస్‌ఆర్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్లతో కడప జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్లతో ప్రకాశం జట్టు విజయం సాధించగా, చిత్తూరు- అనంతపురం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్లతో అనంతపురం జట్టు గెలుపొందింది. అలాగే కృష్ణ- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక పాయింట్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించగా విజయనగరం- గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 పాయింట్ల తేడాతో గుంటూరు విజయం సాధించగా, శ్రీకాకుళం- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 17 పాయింట్లతో శ్రీకాకుళం గెలుపొందింది. చిత్తూరు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 18 పాయింట్లతో చిత్తూరు గెలుపొందగా, కృష్ణ- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క పాయింట్ తేడాతో కృష్ణ జట్టు విజయం సాధించింది. అలాగే అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల బాలికల విభాగంలో వైఎస్‌ఆర్ కడప- విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 పాయింట్ల తేడాతో విశాఖపట్నం, కర్నూలు- ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 16 పాయింట్లతో కర్నూలు విజయం సాధించగా, ప్రకాశం-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 పాయింట్లతో గుంటూరు జట్టు గెలుపొందింది. శ్రీకాకుళం- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 26 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు ఘనవిజయం సాధించింది. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి.

నాలుగేళ్లుగా పాల్గొంటున్నాను

- యమున, శ్రీకాకుళం జిల్లా



గడిచిన నాలుగేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ఉద్దానం ఛాంపియన్స్‌తో పాటు అసోసియేషన్ మీట్స్, స్కూల్ గేమ్స్ ఆడాను. ఏడో తరగతి నుంచి గేమ్స్‌లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని 6 మెడల్స్ ప్రశంసాపత్రాలు సాధించాను. జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

- ఇందు, వెలిగొండ మండలం, కర్నూలు



కర్నూలు జిల్లా జట్టు తరపున రాయచోటిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. నేను వెలుగొండు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. గడిచిన రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ అండర్-19 విభాగంలో ఎంపికైన రాష్ట్ర స్థాయిలో ప్రజెంట్ చేశాను. క్రీడా పోటీల్లో పాల్గొనడం మానసిక ప్రశాంతతను ఇస్తోంది.

ఇక్కడ ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉంది

-నరసరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం చీఫ్ ప్యాట్రన్



కూటమి ప్రభుత్వం సహకారంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి పట్టణంలో రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల క్రీడాకారులకు మంత్రి ప్రత్యేక చొరవతో అన్నిరకాల ఏర్పాట్లను కల్పించాము. జిల్లా కేంద్రమైన రాయచోటిని క్రీడా హబ్‌గా తయారు చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నిరంతరం పనిచేస్తుంది.

క్రీడాపోటీలతో మానసిక స్థైర్యం

- పూజిత, కొర్లకుంట, కృష్ణా జిల్లా



కబడ్డీ పోటీలు మానసిక స్థైర్యాన్ని నింపుతున్నాయి. నేను కృష్ణా జిల్లాలోని కొర్లకుంటలో గల ముసునూరు ఏపీఆర్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. గత మూడేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. స్టేట్ లెవెల్ మీట్‌లో ఒక సిల్వర్ మెడల్ కూడా సాధించాను.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

-పి.లోకేశ్, కాటకోటేశ్వరం, వెస్ట్ గోదావరి జిల్లా



పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి. నేను వెస్ట్ గోదావరి జిల్లా నిడదవోలులో ఏకేఆర్‌జీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించే మీట్స్‌తో పాటు ప్రైవేట్ మీట్స్‌లో కూడా పాల్గొని 3 షీల్డ్‌లు, 2 మెడల్స్‌తో పాటు ఒక కప్పు కూడా గెలుపొందాను.

రాష్ట్ర పోటీలు ఆనందాన్ని కలిగించింది

-దివ్యశ్రీ, తాడిమల్లు, వెస్ట్‌గోదావరి జిల్లా



నేను వెస్ట్ గోదావరి జిల్లా తాడిమల్లు జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్నాను. గత సంవత్సర కాలంగా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాను. ఇప్పటివరకు రెండు స్టేట్ మీట్స్‌తో పాటు జిల్లా స్థాయిలో కూడా ఆడి ఒక మెడల్ సాధించాను. ఆడపిల్లలకు చదువే కాకుండా క్రీడా పోటీలు మానసిక ధైర్యాన్ని నింపుతాయి. ఇక్కడ క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు.

కోచ్ శిక్షణతో క్రీడల్లో రాణిస్తున్నాను

- విస్మత్ గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల, కడప



కోచ్ శ్రీధర్ శిక్షణతో పోటీల్లో బాగా రాణిస్తున్నాను. గతంలో కంటే గత రెండు సంవత్సరాలుగా కోచ్ శ్రీధర్ వద్ద శిక్షణ పొందిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాను. కడప జిల్లా జట్టు తరపున రాయచోటిలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చింది.

మదనపల్లె పట్టణ బ్యాంకుకు..

మోగిన ఎన్నికల నగారా..

11న ఓటర్ల తుది జాబితా ● 22న నామినేషన్ల స్వీకరణ ● 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

మదనపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోఆపరేటివ్ పట్టణ బ్యాంకుకు ఎన్నికల నగారా మోగింది. నాలుగేళ్లకు పైగా అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పీఏఐసీ) పాలనలో ఉన్న అర్బన్ బ్యాంకుకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. అధికారుల సూచన మేరకు ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్.. ఎన్నికల అధికారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.దుర్గమ్మను ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ క్రమంలో స్థానిక టౌన్‌బ్యాంకులో బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్‌తో కలసి ఎన్నికల అధికారి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మాట్లాడుతూ అక్టోబరు 26, కలెక్టర్ తనను ఎన్నికల అధికారిగా నియమించినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా నవంబరు 2న ఓటర్ల జాబితా ప్రదర్శన, 3న ఓటర్ల జాబితా ప్రచురణ, వారం రోజుల లోపల అభ్యంతరాల స్వీకరణ, అనంతరం 11న ఫైనల్ జాబితా ప్రచురిస్తామన్నారు. అనంతరం 22న నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని దుర్గమ్మ పేర్కొన్నారు. అభ్యర్థుల నుంచి ఎన్నికలకు పోటీ ఉంటే



వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి దుర్గమ్మ, టౌన్‌బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్

29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి వివరించారు. గతంలో ఉన్న పాలకవర్గం పదవీకాలం 2020 జూన్ 19వ తేదీతో పూర్తికాగా, అప్పటి నుంచి ప్రత్యేకాధికారి పాలనలో పట్టణ బ్యాంకు కొనసాగింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మదనపల్లెటౌన్ ప్రధాన కార్యాలయం, ఎన్‌టీఆర్ సర్కిల్ బ్రాంచి, పుంగనూరు బ్రాంచి పరిధిలోని 4,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 12 మంది డైరెక్టర్లలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకో నున్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాశ్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఆర్‌వో, ఆర్డీవో

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రాయచోటి నూతన డీఆర్‌వోగా నియమితులైన కె.మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌ను కూడా వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతనంగా జిల్లాకు వచ్చిన డీఆర్‌వో, ఆర్డీవోలకు కలెక్టర్, జేసీలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఆర్‌వో తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.



డీఆర్‌వోగా బాధ్యతలు తీసుకుంటున్న మధుసూదన్‌రావు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కార్లు, ప్రమాదంలో గాయపడిన బాధితుల్లో ఒకరు

కలకడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతువారిపల్లె క్రాస్ సమీపంలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పీలేరు నుంచి కలకడ వైపు వస్తున్న కారును రాయచోటి నుంచి పీలేరుకు వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారులోని రాజంపేటకు చెందిన రఘు(39)కు, అలాగే మరో కారులోని కర్నూలు జిల్లాకు చెందిన మహేష్(25), శ్రీనివాసులు(40), అనిల్(37), కిశోర్(45)లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమితం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో
భవన నిర్మాణ కార్మికులకు గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దమండ్యంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం పెద్దమండ్యం పాపేపల్లె గ్రామంలోని తురకపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు షేక్ నజీర్ (40), అదే గ్రామానికి చెందిన గుడిసోని చెరువుకు చెందిన మరో కార్మికుడు పఠాన్ ఇమ్రాన్(24) ప్రతి రోజులాగే సోమవారం భవన నిర్మాణ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో మోల్డింగ్ కమ్మి పైకెత్తుతున్న సందర్భంగా 33 కేవీ విద్యుత్ లైన్‌కు కమ్మి తగిలి విద్యుత్‌షాక్‌తో ఇద్దరు భవన కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు.. సోమవారం నిమ్మనపల్లె మండలం, బండ్లపైకు చెందిన అగీస్తప్ప భార్య డి.లక్ష్మమ్మ(60) చౌడేపల్లె మండలం, ఎ.కొత్తూరుకులోని తన సోదరుడు ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. చేతికి తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతి రుయాకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ మేరకు చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో పుంగనూరు మండలం, ఈడిగపల్లె గ్రామం, కురవూరుకు చెందిన లక్ష్మణ కుమారుడు రైతు ఎ.నవీన్(35) సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు తిరుపతి రుయాకు తరలించారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాజ్యలక్ష్మి

కలికిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఈడీ)గా సాంఘిక సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న జి.రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిప్యుటేషన్ ప్రాతిపదిక పైన ఏడాది గడువుతో ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వ పేర్కొంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించింది. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

రైల్వేకోడూరులో గంజాయి జోరు



- కొరవడిన నిఘా, మత్తులో యువత
- ఘర్షణలకు దారితీస్తున్న వైనం
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు రైల్వేకోడూరులో జోరుగా సాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని రైల్వేకోడూరుకు సరఫరా చేస్తున్నారు. యువకులు అత్యధికంగా గంజాయికి అలవాటుపడి బానిస అవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. రైల్వేకోడూరులో గంజాయి విక్రయాల ముఠా ఉంది. గంజాయి తీసుకున్న యువకులు దాడులకు దిగుతున్నారు. దీంతో గొడవలు మరింత పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన సంఘటనలే ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.

నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్ రూటు, రెడ్డివారిపల్లె రూటు, బృందావనం కాలనీ రూటు, లక్ష్మీప్యారడైజ్ రూటు, చిట్వేలి రూటు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. గంజాయికి యువకులు ఐదేళ్లుగా అలవాటు పడ్డారు. దీంతో గొడవలు చెలరేగుతున్నాయి. ఇటీవల ఇరువర్గాలు గంజాయి తాగి ఘర్షణలకు దిగారు. ఇరువురికి తీవ్రంగా గాయాల య్యాయి. అదే విధంగా ప్రతి రోజు గంజాయి సేవించిన యువకులు బైకుల్లో స్పీడుగా వెళ్లడం, పాత కక్షలు మనసులో పెట్టుకుని ఘర్షణలకు దిగడం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది క్రితం గంజాయి విక్రయాలు చేస్తున్న మహిళను, గంజాయి సేవించిన యువకులను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ గంజాయి విక్రయాలు ఆగడం లేదు. గంజాయి ఆకును బాగా నలిపి దాన్ని సిగరేట్‌లో సగం పొడిని పారవేసి ఖాళీ భాగంలో నింపి తాగుతున్నారు. దీంతో మత్తులోకి జారిపోయి మత్తు వదిలినంత వరకు ఏ పని చేస్తుంటారో అదే పనిలో నిమగ్నమై ఉంటారు. పాత కక్షలు కల్గిన వ్యక్తులు గొడవలు పడుతున్నారు. గంజాయి మత్తులో యువత జీవితాన్ని చిత్తు చేసుకుంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నా పట్టించుకోకుండా గంజాయి విక్ర యాలు సాఫీగా సాగుతున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహ రిస్తున్నారు. రైల్వేకోడూరు పట్టణంలో ఎక్కువగా రెడ్డివారిపల్లె, రైల్వేస్టేషన్ రూట్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, ఘర్షణలు అక్కడే ఎక్కువగా జరుగుతున్నా యని, గంజాయిని తాగిన యువకులు మోటారు బైకుల్లో వెళుతూ కేకలు పెడుతూ, వేగంగా బైకులను నడుపుతూ వికృత చేష్టలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆ రూట్లో యువకులు, మహిళలు వెళ్లాలంటే భయపడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు పది కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. చాలా మంది యువకులు మత్తులో బుల్లెట్ బైకుల్లో శబ్దాలు చేస్తూ వెళుతుండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రుల భయం లేకుండా పెరిగిన యువకులు చదు వులు మానేసి జల్సాలకు అలవాటు పడిపోతున్నారు. రాత్రి వేళల్లోనే గంజాయి బ్యాచ్ తిరుగుతోంది. ఇటీవల రెడ్డివారిపల్లె రూటులో ఇద్దరి మధ్య గొడవలు జరిగి గంజాయి బ్యాచ్ వల్ల కుటుంబ సభ్యులు కూడా వీధినపడ్డారు. ఈ ఘర్షణలో ఒకరికి కత్తిపోట్లు పడ్డాయి. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో ఆరా తీశారు. అయినా గంజాయి తాగుతున్న యువకుల ఆగడాలు రోజు, రోజుకు పెరుగుతున్నాయి. ఇదే కాకుండా ఇటీవల రేణిగుంట-మామండూరు మధ్యలో ఒక వ్యక్తి కోతి పెట్టుకుని ఉండగా ఓబులవారిపల్లె మండలానికి చెందిన రేపూరి సునీల్‌కుమార్ అనే వ్యక్తి కోతికి అరటి పండు తినిపించిన పాపానికి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో సునీల్‌కుమార్‌పై కోతిని పట్టుకున్న వ్యక్తి కత్తితో దాడి చేసి గాయ పరిచిన సంఘటన చోటు చేసుకుంది. నిఘా లేకపోవడం వల్లే మరిన్ని సంఘటనలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తు న్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని గట్టి చర్యలు తీసుకుంటే గంజాయి విక్రయాలు తగ్గు ముఖం పడతాయని ప్రజలు కోరుతున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

- హేమసుందర్‌రావు, సీఐ, రైల్వేకోడూరు

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. వస్తున్న ఆరోపణలు సులువుగా తీసుకోకుండా గట్టి చర్యలు చేపడతాం. విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రి వేళల్లో జరుగుతున్న సంఘటనలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాము.



దాడి చేయడంతో ఆస్పత్రిపాలైన సునీల్ కుమార్ (ఫైల్)

హైవే.. నోవే...!

- కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానం
- అడుగడుగునా గుంతలమయం
- ప్రయాణం నరకప్రాయం.. తరచూ ప్రమాదాలు
- ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు


బోయనపల్లె వద్ద పాడైపోయిన కడప-చెన్నై హైవే

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. కడప నుంచి ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మీదుగా వెళ్లే ఈ రహదారి పూర్తిగా పాడైపోయింది. ఇటీవల (నాలుగు రోజుల క్రితం) కురిసిన ఒక మోస్తారు వర్షాలకు ఈ డబుల్ లైన్ రహదారిలో పెద్దఎత్తున గుంతలు పడి వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కడప నుంచి రేణిగుంట వరకు దాదాపు 2వేలకు పైబడి గుంతలు పడినట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతు న్నారు.

జాతీయ రహదారి అంటే.. అతివేగంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు అనుకుంటారు. అయితే ఒక్కోచోట అడుగుకు పైబడి గుంతలు పడిపోవడతో వాహనాలు వెళ్లడం గగనంగా మారింది. ఇక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా చెన్నై-తిరుపతికి వెళుతుంటారు. ప్రతిరోజు వేలాది వాహనాలు ఈమార్గంలో వెళుతుంటాయి. ఇంత పెద్దఎత్తున గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఇక వర్షం పడినప్పుడు రోడ్డుకిరు వైపులా కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్లపై నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. కడప నుంచి మొదలు పెడితే అడుగడుగునా గుంతలున్నాయి. దీంతో బస్సులు, లారీలు, ట్యాంకర్లు, ఇతర వాహనాలు అతి తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తోంది. బస్సుల్లో అయితే కొద్దిపాటి వేగం పెంచినా కుదుర్లు తప్పవు. గర్భిణీస్త్రీలు, వృద్ధులు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇక ఈ రోడ్డులో వన్‌వేలో వాహనాలు నడపకపోతే ప్రమాదాలు తప్పవు. ఇటీవల అనేకచోట్ల ఈ గుంతల్లో వాహనాలు పడి వాహనదారులు కిందపడి గాయపడ్డారు. రాజంపేట మండలం ఊటుకూరు వద్ద ఓ ద్విచక్ర వాహనం గుంతలో పడిపోగా ఎదు రుగా వస్తున్న వాహనం అతనిపై వెళ్లడంతో కాలు విరిగి పోయింది. ఈ డబల్‌లైను రోడ్డులో నాలుగులైన్ల రహదారి లాగా ఎటువైపు వెళ్లే వాహనాలు అటు వెళ్లడం కష్టం. వాహనాలు ఎదురు పడడం, వాటి ని తప్పించుకోవాలంటే గుంతల్లో వెళ్లాల్సి రావడం, గుంతలున్న చోట ఒకవైపు వెళ్లాల్సిన వాహనం మరోవైపు వెళ్లాల్సి రావడం ఇత్యాది కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో రూ.3600 కోట్లతో నాలుగు లేన్ల రహదారికి టెండర్లు పూర్తయినా ఇంతవరకు ఆ రోడ్డు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం నాలుగులైన్ల రహదారి పూర్తయ్యేవరకు ఈ డబల్‌లైను హైవేపైనే వెళ్లాల్సి ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ జాతీయ రహదారిపై పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.


రాజంపేట పట్టణానికి సమీపంలో గుంతలమయమైన రోడ్డు

వెంటనే గుంతలను పూడ్చండి



రేణిగుంట - కడప జాతీయ రహదారిపై పడ్డ భారీ గుంతలను పూడ్చాలి. ఈ గుంతలను పూడ్చకపోతే చాలా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రివేళ ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు వెళితే అంతే సంగతులు. కొద్దిపాటి వర్షానికే హైవేరోడ్డు అంతా గుంతలతో పాడైపోయింది. డిసెంబరు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశా లున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి కొత్తగా తారువేసి రోడ్డును పునరుద్ధరించి ప్రమాదాలు అరికట్టాలి.

-మేకా నరసింహులు, మేకావారిపల్లె, రాజంపేట మండలం.

ప్రమాదాలు జరిగితే.. అధికారులదే బాధ్యత



కడప-చెన్నై హైవే రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు వెళుతుం టాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలమయం అయ్యింది. వెంటనే గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేప ట్టాలి. ఈ గుంతలు వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా 4 లైన్ల రోడ్లను వెంటనే ప్రారంభించాలి.

-బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట మండలం

యానిమేషన్ రంగానికి మంచి డిమాండ్

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో యానిమేషన్ రంగానికి చక్కటి ప్రాధాన్యత లభిస్తుందని.. ఈ కోర్సు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తెలిపారు. సోమవారం యూనివర్శిటీలో యానిమేషన్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో యానిమేషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో యానిమేషన్‌కు చక్కటి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు యానిమేషన్ కోర్సు ఒక చక్కని వరమని అన్నారు. రిజిస్ట్రార్ ఎస్.రాజేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీడియోగేమ్‌లు, సినిమాలు అద్భుతమైన కళారూపాల్లో యానిమేషన్ వినియోగంతో కొత్త పుంతలు తొక్కిందన్నారు. కార్యక్రమంలో యానిమేషన్ కోఆర్డినేటర్ దినేశ్, అధ్యాపకులు జనార్ధన్, శాంతి, రవికుమార్, విద్యానంద్, సావిత్రి, శివ, క్రిష్టారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను ఉపయోగించుకోవాలి

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్ ద్వారా నిర్మాణ రంగంలో నూతన సాంకేతికను ఉపయోగించుకొని నాణ్యత పెంచుకోవాలని పలువురు సివిల్ ఇంజనీరింగ్ ప్రముఖులు తెలియజేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల పాటు జరిగిన సివిల్ ఇంజనీరింగ్ పరిశోధనలు అనే అంశంపై సమావేశాలు సోమవారంతో ముగిశాయి. వివిధ రంగాలకు చెందిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈసమావేశంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ విధానాన్ని సివిల్ ఇంజనీరింగ్‌లో ఎలా ఉపయోగించుకోవాలి, భూమి, మౌలిక విషయాలు వంటి అంశాలపై చర్చించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, ఇతర అధికారులు, నాలుగు క్యాంపస్‌లకు చెందినపలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి సోమవారం పెన్నానదికి 12,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలా శయం నుంచి 14వేల క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుం డటంతో పెన్నాకు 12,300 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 74 క్యూసె క్కులు, దక్షిణకాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు కడప జిల్లాలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన

పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 10.00 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి రోడ్డుమార్గాన వేంపల్లెకు చేరకుని అక్కడ పార్టీ నాయకులతో సమావేశ మవుతారు. అనంతరం రోడ్డు మార్గాన పులివెందులకు చేరుకుంటారు. పులివెందులలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారు. బుధవారం లింగాల మండలంలో పర్యటిస్తారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి గురువారం తిరిగి విజయవాడకు వెళతారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో నారాయణరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి (47) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... రామిరెడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులరెడ్డికి 10 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈయనకు భార్య శశికళ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక నష్టపోయాడు. అప్పులు నెత్తికొచ్చాయి. సుమారు రూ.20 లక్షల మేర అప్పుఉండడం, అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో ఆదివారం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శ్రీనివాసులరెడ్డిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

అత్తను కొట్టిన కేసులో అల్లుడికి ఏడాది జైలుశిక్ష

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అత్తను రోకలి బండతో కొట్టి గాయపరిచిన కేసుకు సంబంధించి అల్లుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి భార్గవి సోమవారం తీర్పునిచ్చినట్లు చిన్నచౌకు సీఐ తేజ్‌మూర్తి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప పట్టణంలోని నెహ్రూ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో కుటుంబ కలహాల కారణంగా 2022 జూన్ 2న అత్తపై అల్లుడు మంజుల శ్రీనివాసులు రోకలి బండ తీసుకుని చేతిపై దాడి చేయడంతో ఆమె గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు విన్న జడ్జి నేరం రోజువు కావడంతో శ్రీనివాసులుకు ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రంగసముద్రంలో భూవివాదం


సమస్యను అదుపు చేసిన పోలీసు అధికారులు

పోరుమామిళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నెం.227లో సుమారు 41 ఎకరాలు వంక పోరంబోకు పొలం ఉండేది. అందులో 23 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు సమాచారం. అయితే 2010లో ఆ సర్వే నెంబరులో ఆర్మీ కోటా కింద ఆర్మీ ఉద్యోగి సయ్యద్‌హుస్సేన్‌కు 4.40 ఎకరాలు నమోదు అయినట్లు తెలిసింది. అయితే సోమవారం సయ్యద్‌హుస్సేన్ తమ బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లడంతో రంగసముద్రం గ్రామానికి చెందిన స్థానికులు అడ్డు చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం పోలీసు అధికారులకు తెలియడంతో సమస్యను సద్దుమణిగేలా చేశారు. తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి వీఆర్వో ఓబయ్యను సంఘటనా స్థలానికి పంపించి వివరాలు ఆరా తీశారు. ఇరువర్గాల వారితో ఆయన మాట్లాడి రికార్డులు పరిశీలించి ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతామన్నారు. అంతవరకు ఏ ఒక్కరూ భూమిలో దిగరాదని ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది దళితవాడకు చెందిన మద్దూరు నాగస్వరూప (22) అనే విద్యార్థిని ఆదివారం సాయంత్రం అదృశ్యమైంది. డిగ్రీ చదువుతున్న తన కూతురు కనిపించడం లేదంటూ విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మద్దూరు సుబ్బరాయుడుకు ముగ్గురు కూతుర్లు. పెద్దకూతురికి తంబళ్లగొంది దళితవాడలో ఆదివారం పెళ్లి జరుగుతుండగా సాయంత్రం రెండో కూతురు నాగస్వరూప కనిపించకుండా పోయింది. అదే దళితవాడకు చెందిన బంగారుపల్లె వెంగయ్యపై అనుమానం ఉన్నట్లు విద్యార్థిని తండ్రి సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

స్వాహా చేసిన డబ్బులపై నేడు విచారణ

చాపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన హనీఫ్‌బాష గ్రామ పంచాయతీల నిధులు స్వాహా చేశాడు. దీనిపై జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క, ఈనెల 29న మంగళవారం విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హనీఫ్‌బాష బద్రిపల్లె, వెదురూరు, పల్లవోలు గ్రామపంచాయతీలకు సంబంధించి సుమారు రూ.5.70 లక్షలు స్వాహా చేశాడు. ఈఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు విడతల వారీగా సర్పంచులకు, అధికారులకు తెలియకుండా స్వాహా చేశాడు. హనీఫ్‌బాషను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో మాట్లాడుతున్నసీఐటియూ నాయకులు వెంకటసుబ్బయ్య

కడప నాగరాజుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కడప కార్పొరేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అనేకమార్లు అధికారులకు తెలిపినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, అడిషనల్ వర్కర్స్‌కు పనిభద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటియు నగర అధ్యక్షుడు చంద్రరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, అదే విధంగా క్లాప్ డ్రైవర్లకు జీవో నెం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి మాట్లాడుతూ నగరంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని.. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఇత్తడి ప్రకాశ్, ఆనంద్, నాగరాజు, నరసింహులు, సాయి, నిత్యపూజయ్య, ఆదాం, మస్తాన్, పెద్దోడు, బాలాజీ, రమాదేవి, దస్తగిరమ్మ, సుంకన్న, నాగయ్య, మరియు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతగా గురుకుల పాఠశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అభినందించారు. అనం తరం మాట్లాడుతూ పాండిచ్చేరి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఫర్‌ఫ్లోర్ కర్లింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కమలాపురం గురుకుల పాఠశాల విద్యార్థినిలు నిలవడం అభినందనీయమన్నారు. పదో తరగతి చదువుతున్న దీక్షిత మిక్స్‌డబుల్స్‌లో కాంస్య పతకం సాధించింది. అదేవిధంగా జాతీయ స్థాయి పోటీల్లో పదోతరగతి చదివే పూజిత చందనప్రియ, 9చదువుతున్న హరిక, జెస్సికాలు గేమ్ ఆడారని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని అన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తుల సమ్మ, పీఈటి చంద్ర కళావతి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు బి.కొత్తకోట విద్యార్థి



బి.కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న శ్రావణ్ లక్ష్మీకర్ సౌత్‌జోన్ కబడ్డీజట్టుకు ఎంపికయ్యాడు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కబడ్డీ జట్టు ఎంపికలో ప్రతిభ కనపరచిన శ్రావణ్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ ప్రాబబుల్స్‌లో 300 మంది పాల్గొన్నప్పటికీ శ్రవణ్‌కు అవకాశం దక్కింది. ఈనెల 30వ తేదీ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే ఇండియా సౌత్‌జోన్ జట్టు సభ్యుడిగా పోటీలలో పాల్గొననున్నాడు. కబడ్డీలో ప్రతిభ చూపి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైన శ్రావణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, రాజేంద్రనాయక్, సోమశేఖర్‌లు అభినందించారు.

అన్నమాచార్య యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాల ప్రారంభోత్సవం


వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో సోమవారం వ్యవశాయ కళాశాలను యూనివర్శిటీ వ్యవస్థాపకులు చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కోర్సు తొలి సంవత్సరం చేరే విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ మన స్థూల దేశీయోత్పత్తి వ్యవసాయం ప్రధాన వనరు అని, మనదేశం ఎగుమతి ఆదాయానికి 70 శాతం వ్యవసాయమే తోడ్పడుతుందన్నారు. అందువల్లే అన్నివిధాల ఆలోచించి రాజంపేట లాంటి చిన్న పట్టణంలో ఈ ప్రాంత విద్యార్థులను ఉద్దేశించి యూనివర్శిటీలో వ్యవసాయ కళాశాలను ప్రారంభించామన్నారు. ఇక్కడ వ్యవసాయంలో ఉన్నత చదువులు చదివి అనేక పరిశోధనలు చేసి మెరుగైన వ్యవసాయ దిగుబడికి తోడ్పడాలన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ లోకనాథ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి : ఎస్పీ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్నఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులు వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్, ప్రభుత్వ వైద్యులు ఎన్ఆర్ భాస్కర్‌రెడ్డి, షేక్. హీనా, ఎస్. కరీముల్లాబాషా, ఎస్. కదీర్‌బాషా, ఎన్. ప్రశాంతి, ఎన్. ధరణికుమార్, సయ్యద్‌సుకుమార్, రంజిత, దేవీప్రశాంతి, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' ఫిర్యాదులకు ప్రాధాన్యం

ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్ట పరిధిలో విచారించి న్యాయం అందించడానికి అన్నమయ్య జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ విద్యా సాగర్ నాయుడు ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

మత్తుకు అలవాటుపడి జీవితాలు పాడు చేసుకోవద్దు: సీఐ

కడప క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మత్తుకు అలవాటుపడి జీవితాలు పాడు చేసుకోవద్దని కడప టూటౌన్ సీఐ నాగార్జున హెచ్చరించారు. టూటౌన్ ప్రాంతంలో మత్తు ట్యాబ్లెట్, గంజాయి వాడే యువకులకు సోమవారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం చేసుకున్న వారవుతారని, మీ కుటుంబాలకు కూడా ఆవేదన మిగిల్చిన వారవుతారన్నారు. సత్ప్రవర్తనతో సమాజంలో జీవిస్తూ మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెడు మార్గాల వైపు నడిస్తే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా వారిలో మార్పు తీసుకురావాలని, లేకుంటే వారి జీవితం నాశనమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ హుసేన్ పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలకు న్యాయం

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. వేంపల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):గండిరోడ్డులోని సుమో స్టాండ్ సమీపంలో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. వారి నుంచి రూ.7500ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

మహిళాజిల్లా గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో, కడప.
I.A. No. 186/2023 in O.S.No. 60/2023
చింతకుంట శ్రీలత - పిటిషనర్ / వాది
V/s
అంకిరెడ్డిపల్లె రవీంద్రారెడ్డి S/o ఏ. సుబ్బరామిరెడ్డి, డి.నెం. 8/116-7, ప్రకాష్‌నగర్, చిన్నచౌక్, కడప సిటి, వైఎస్‌ఆర్ కడప జిల్లా - రెస్పాండెంట్/ప్రతివాది
పై కేసును అనగా ఐ.ఏ. నెం. 186/2023 ఇన్ ఓ.ఎస్.నెం. 60/2023ని పిటిషనర్/వాది అయిన చింతకుంట శ్రీలత రాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప నందు రెస్పాండెంట్/ప్రతివాదిపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి కేసు పెండింగ్‌లో ఉండగా ఇతరుల పేరిట రిజిష్టర్ చేయకుండా తాత్కాలిక నిషేధాజ్ఞలు కోరుతూ పిటిషన్ దాఖలు చేసి యున్నారు. అయితే ప్రతివాదియైన అయిన మీరు కోర్టు నోటీసు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారు ఆదేశించుచూ 20-11-2024కు వాయిదా వేసి రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీరు ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో 20-11-2024వ తేదీన 10.30 గంటలకు కోర్టునందు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పై పిటిషన్‌ను పరోక్షమున తీర్మానించి ఉత్తర్వులు జారీ చేయునని తెలియజేయడమైనది.
రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
శ్రీ పి.వి.రమణారెడ్డి, వాది తరపు వకీలు

మహిళాజిల్లా గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో, కడప.
O.S.No. 60/2023
చింతకుంట శ్రీలత - పిటిషనర్ / వాది
V/s
అంకిరెడ్డిపల్లె రవీంద్రారెడ్డి S/o ఏ. సుబ్బరామిరెడ్డి, డి.నెం. 8/116-7, ప్రకాష్‌నగర్, చిన్నచౌక్, కడప సిటి, వైఎస్‌ఆర్ కడప జిల్లా - రెస్పాండెంట్/ప్రతివాది
పై కేసును అనగా ఓ.ఎస్.నెం. 60/ 2023ని పిటిషనర్/వాది అయిన చింతకుంట శ్రీలత రాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కడప నందు రెస్పాండెంట్/ ప్రతివాదిపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి తన పేరిట రిజిష్ట్రేషన్ చేయమని కేసును దాఖలు చేసియున్నారు. అయితే ప్రతివాది అయిన మీరు కోర్టు సమన్లు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ఆదేశించుచూ 20-11-2024కు వాయిదా వేసి మీకు పై కేసు నందు ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీరు ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో 20-11-2024వ తేదీన 10.30 గంటలకు కోర్టునందు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పై పిటిషన్‌ను పరోక్షమున తీర్మానించి ఉత్తర్వులు జారీ చేయునని తెలియజేయడమైనది.
రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
శ్రీ పి.వి.రమణారెడ్డి, వాది తరపు వకీలు

OFFICE OF THE SUPERINTENDENT, GOVT. GENERAL HOSPITAL
YSR DISTRICT: KADAPA
RC.No.4650/GI/GGH/2024, DT: 28-10-2024

TENDER NOTIFICATION

Sealed Tenders are Invited from the manufactures/authorized Dealer / Registered Suppliers for supply of equipment to the GGH, Kadapa.

S.No.	NAME OF THE EQUIPMENT	QUANTITY
01.	HORIZANATAL AUTOCLAVE-250 LTS., (MAKE-REICO, CISTRON, NAT STEEL)	1

The Tender Forms and list of items along with terms and conditions can be obtained from the office of the Superintendent, Govt. General Hospital, Kadapa on payment of **Rs. 1000.00** by way of **demand draft** taken in any nationalized bank payable at Kadapa in favour of the **Convenor, HDS, Govt. General Hospital, Kadapa** in person on any working day from 10.30 A.M. to 5 P.M.

Date of Issue of Tender Forms	--	29-10-2024 to 05-11-2024
Date of Receipt of Tender forms	--	29-10-2024
Last date for submission of Tenders	--	05-11-2024 - upto 2 p.m.
Opening Tenders	--	05-11-2024 at 4 p.m.

SUPERINTENDENT, Govt. General Hospital, Kadapa — Sd/- JOINT COLLECTOR / CHAIRMAN, District Purchase Committee, Kadapa.

అపరిశుభ్రంగా గ్రామ సచివాలయాలు

● నిధులు లేవు... పరిశుభ్రత లేదు ● ఉరుస్తున్న భవనాలు ● గదుల్లో పేరుకుపోయిన దుమ్ము




ఏఎన్‌ఎం గదిలో ఉంచిన మందులపై పేరుకుపోయిన దుమ్ము... శ్లాబు నుంచి నీరు ఉరుస్తుండడంతో ఫ్యాను చుట్టూ నీటి చెమ్మ

చెన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పరిశుభ్రత కరువైంది. భవనాలు ఉరుస్తున్నాయి. దుమ్ము పేరుకుపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. నిధులు అందకపోవడం, స్వీపర్లు లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని అధికారులు పేర్కొంటున్నారు. ఆ వివరాలు ఇవీ... మండల వ్యాప్తంగా తొమ్మిది సచివాలయాలకు సంబంధించి ఇప్పటి వరకు స్వీపర్లను, అటెండర్లను నియమించకపోవడంతో ఆ భవనాల్లో అపరిశుభ్రత నెలకొంది. దుమ్ము పేరుకుపోతుంది. ఏ గదిలోకి వెళ్లినా దుమ్ము ఎక్కువగా ఉంటూ అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అలర్జీకి గురి చేస్తోంది. కొన్ని గదుల్లో అయితే దుమ్ము లేస్తే అక్కడికి వెళ్లిన సిబ్బంది దాని ధాటికి దగ్గుతూ బయటికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. చెన్నూరు రెండో సచివాలయంలో ఫ్యాను పైపు ద్వారా వర్షం నీరు చుక్కలుగా పడుతుండటంతో సిబ్బంది జారిపడేలా ఉంది. మందులు ఉన్న ఏఎన్‌ఎం గదిలో దుమ్ము విపరీతంగా పేరుకుపోయింది. వీఆర్వోలు కూర్చునే గదులు, సిబ్బంది పనిచేసే గదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఏమిటి గదులు ఇలా ఉన్నాయి, ఇక్కడ స్వీపర్లు లేరా, మరీ ఇంత దారుణమా అంటూ నిట్టూర్పు విడుస్తున్నారు.

నిధుల లేమి.. సిబ్బంది కొరత వాస్తవమే



గ్రామ సచివాలయంలో గదులు శుభ్రం చేసేందుకు స్వీపర్లు లేని మాట వాస్తవమే. పైగా భవనాల నిర్వహణకు నిధులు కూడా లేవు. ఏమీ చేయలేని పరిస్థితి. గతంలో ప్రభుత్వంలో భవనాలు కట్టారు తప్ప స్వీపర్లు పోస్టులు మంజూరు చేయలేదు. ఇప్పుడు నిర్వహణ చేపటాలంటే నిధులు లేవు. ఇక్కడే కాదు.. ప్రతి భవనంలో ఇదే పరిస్థితి ఉంది.

- కిరణ్‌మోహన్‌రావు, ఎంపీడీఓ, చెన్నూరు

టీడీపీ బలోపేతానికి కృషి : బీటెక్‌రవి

లింగాల/పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నామని టీడీపీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని పెద్దకుడాల గ్రా మంలో సోమవారం వైసీపీ నుంచి 20 కుటుంబాలు బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరాయి. వెంకటనారాయణరెడ్డి, శివారెడ్డి, గంగాధర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిలతో పాటు మరికొందరికి బీటెక్ రవి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 28 (మారుతీనగర్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కె. మణికంఠ తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూయువ కేంద్రం వారి ఆధ్వర్యంలో దివాలీ విత్ మై భారత్ అనే స్వచ్ఛత ప్రోగ్రాంను సోమవారం రైతుబజార్‌లో నిర్వహించారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఆరోపణలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ కోరారు. సోమవారం అక్కాయపల్లెలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరులో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి ఆయనకు మతిభ్రమించిందన్నారు. జగన్ మెప్పు కోసం సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్, షర్మిల మధ్య ఆస్తి గొడవలు రోడ్డున పడడంతో షర్మిల వ్యాఖ్యలను ప్రజలు నమ్ముతున్న తరుణంలో అక్రమాస్తులు ఎక్కడ బయటపడతాయోనన్న ఉద్దేశ్యంతో విజయసాయిరెడ్డి వారి తప్పులను కప్పి పుచ్చుకోవడానికి సీఎంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్ మరణానికి రిలయన్స్ అధినేత కారణమని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిలయన్స్ ఆస్తులను ధ్వంసం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారమంతా పక్కదారి పట్టించేదుకు విజయసాయిరెడ్డి నేరారోపణలు చేస్తున్నారన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం నిర్వహించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం నిర్వహించాలని కమిషనర్ ఎన్. మనోజ్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నగరంలో ఉన్న కమర్షియల్ షాపుల ట్రేడ్ లైసెన్సు వివరాలు సకాలంలో అందించాలని సూచించారు. అలాగే చెత్తపాయింట్ల చెత్త తీసిన వెంటనే బ్లీచింగ్ చేసి ఆ ప్రాంతాన్ని శుభ్రపరచాలన్నారు. ప్లానింగ్ విభాగంలో జాప్యం లేకుండా వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ చేసి త్వరితగతిన అప్రూవల్ చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, ఈఈ నారాయణస్వామి, ధనలక్ష్మి, అసిస్టెంటు సిటీ ప్లానర్ మునిరత్నం పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి



డ్రాయింగ్ మాస్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కడప నాగరాజుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ గంగిరెడ్డి, హెచ్‌ఎం నాగమణి అన్నారు. మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో డ్రాయింగ్ మాస్టరుగా పనిచేస్తున్న దేవనేని చంద్రశేఖర్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ తన శిష్యులను ఎందరినో గురువులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు డ్రాయింగ్ విద్యను నేర్పించడం దేవుడు తనకిచ్చిన వరమన్నారు. పదవీ విరమణ తరువాత కూడా తాను పిల్లలకు విద్యను నేర్పిస్తానని అన్నారు.

సంక్షిప్తం

టీడీపీ సభ్యత్వ నమోదు

సీకేదిన్నె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని మండల కన్వీనర్ టి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. యూనిట్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, ఐటీడీపీ టీం సభ్యులు బిట్టి ఆది, శివానందయాదవ్, మదన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం సీఎస్‌ఐ పాఠశాల ఆవరణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా గౌరవాధ్యక్షుడు రాజు, రాష్ట్ర కౌన్సిలరు వీరాంజనేయులరెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్సీలో రావాలసిన బకాయిలను, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాన్నారు.

'తల్లికి వందనం' ఎప్పుడు: ఏబీవీపీ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు విడుదల చేస్తారని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున ప్రశ్నించారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి కింద ఇచ్చే విద్యార్థుల వివరాలు తీసుకుని తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. ఏబీవీపీ నాయకులు పవన్, ప్రశాంత్, అశోక్, కిశోర్ పాల్గొన్నారు.

దళితుల భూములు కాపాడాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 28 (మారుతీ నగర్): దళితుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని రాష్ట్ర మాల మహానాడు (రామాజీవర్గం) జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానియేలు, రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 18వ తేదీన మాల మహానాడు ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు దళితులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

సకాలంలో రేషన్ అందజేయాలి

వల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్లు వాహనాలకు తెల్లవారుజామునే సరుకులు ఇచ్చి ఉదయం 6గంటల నుంచి ప్రజలకు పంపిణీ చేసేలా సహకరించాలని తహసీల్దారు శ్రీవాణి ఆదేశించారు. సోమవారం ఆమె డీలర్లతో సమావేశమయ్యారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన విద్యార్థులు

వేముల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యురేనియం ప్లాంట్‌ను వేముల, లింగాల మండలాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. డీఏఈ ప్లాటినం జూబ్లీ కార్యక్రమం కింద యురేనియం కార్పొరేషన్‌ను సందర్శించారు. డీజీఎం (గని), విభాగాధిపతి కిషోర్‌భగత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ సూపరింటెండెంట్ (మిల్) విపిన్‌కుమార్‌శర్మ, అడిషనల్ సూపరింటెండెంట్ (మెకానికల్) ఎన్‌వీ రాజేశ్‌లు అధునాతన మైనింగ్, ఖనిజధాతువు ప్రాసెసింగ్ పద్ధతులను, 70 ఏళ్ల స్థాపనలో డీఏఈ, యూసీఐఎల్ కార్యక్రమాల గురించి వివరించారు. యూసీఐఎల్ అధికారులు ఎంఎస్ రావు, సుమన్ సర్కార్ పాల్గొన్నారు.

వేంపల్లె అభివృద్ధికి చర్యలు తీసుకోండి



బీటెక్ రవితో మాట్లాడుతున్న జయరామిరెడ్డి తదితరులు

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :వేంపల్లె అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవికి టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. పులివెందులలో ఉన్న బీటెక్ రవిని సోమవారం కలిసి వేంపల్లె సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రకటించడం హర్షణీయమన్నారు.

ఉద్యాన సహాయకుడి తొలగింపు ఉత్తర్వు రద్దు

కలికిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం దొండ్లవాగు రైతు భరోసా కేంద్రం ఉద్యాన సహాయకుడు జి.సాయికుమార్ తొలగింపు ఉత్తర్వును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో బాధ్యతగా లేకపోవడం, ఆర్థిక అవకతవకల కారణంగా ఆయన్ను గతంలో ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే సాయికుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టరు జారీ చేసిన తొలగింపు ఉత్తర్వులను ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. దీంతో సాయికుమార్‌కు భారీ ఊరట లభించింది.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

● సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

వేంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'వేంపల్లె పట్టణం పక్కనే పాపాఘ్ని నది ఉంది. అక్కడి నుంచి ఫిల్టర్ల ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు అందించకపోతే ఎలా' అని ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి అధికారులతో పేర్కొన్నారు. కనీసం తాగునీరు కూడా అందించకపోతే ఎలా అని జడ్పీటీసీ సభ్యు డు రవికుమార్‌రెడ్డి పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డికి సూచించారు. సోమవారం వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కుళాయమ్మ ఆధ్వర్యంలో మండలాధ్యక్షురాలు గా యత్రి అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో గాని, పట్టణంలో గాని నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ప్రజాప్రతినిదులు కోరారు. రైతులే స్వయంగా ప్రీమియం చెల్లించుకోవచ్చని వ్యవసాయాధికారి రాజేంద్ర తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణం కోసం 25 యూనిట్లు మంజూరైనట్లు పశువైద్యాధికారి ఓబులరెడ్డి తెలిపారు. టి.వెలమవారిపల్లెలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని ఆ గ్రామ సర్పంచు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ కార్యక్రమం ఎక్కడ జరిగినా ఆ గ్రామ సర్పంచు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు.
వేంపల్లెలో పెండింగ్ రోడ్డు పనులు 15రోజుల్లో ప్రారంభమవుతాయని, ఇప్పటికే కాంట్రాక్టర్‌తో మాట్లాడామని ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఐదుగురి లోపు పిల్లలు ఉన్న పాఠశాలలను ప్రభుత్వం మూసివేస్తోందని, ప్రజాప్రతినిధులు సహకరించి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా సహకరించాలని ఎంఈఓ స్టాలిన్ కోరారు. ఇంకా సమావేశంలో పలు శాఖలపై చర్చించా రు. తహసీల్దార్ హరినాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ డైటీషియన్‌గా రవికుమార్



చెన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రిలోని క్యాన్సర్ కేర్ యూనిట్‌లో డైటీషియన్‌గా చెన్నూరుకు చెందిన రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. చెన్నూరు పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఎస్‌ఎస్‌గా పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పదోన్నతిపై ఆయన రిమ్స్ డైటీషియన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుంచా సోమయ్య రెండో వర్ధంతి సందర్భంగా సోమవారం దివ్యాంగులకు ప్లేటు, గ్లాసు, పండ్లు అందించారు. ముఖ్య అతిథిగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సోమయ్య కుటుంబ సభ్యులు శివ, చంద్రశేకర్, ఉమాదేవి, చందన, హరీష్, సుమలిక, లోకేశ్‌లు పాల్గొన్నారు.

లైసెన్స్, జీఎస్టీ లేని షాపులు సీజ్ చేస్తాం: ఆర్డీఓలు




కడప: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్.. పులివెందుల: లక్కీడిప్ ద్వారా దుకాణాలను ఎంపిక చేస్తున్న ఆర్డీఓ

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్, జీఎస్టీ లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ హెచ్చరించారు. సోమవారం రాత్రి కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల కేటాయింపులకు సంబంధించి కమిషనరు మనోజ్‌రెడ్డితో కలిసి ర్యాండమైజేషన్ పద్ధతిలో 160 బాణసంచా దుకాణాలకు లక్కీడిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమతి తప్పనిసరి: ఆర్డీఓ

పులివెందుల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళి బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని ఆర్డీఓ గణేష్ల భానుశ్రీ లక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బాణసంచా దుకాణాలకు లక్కీడిప్ ద్వారా అనుమతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాపులను నివాస ప్రాంతాలు, ఆసుపత్రులకు దూరంగా ఉంచాలన్నారు. షాపుల మధ్య నిర్దిష్ట దూరం ఉండాలన్నారు. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులు, ఫ్లెక్సీలను షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సూచించిన సమయంలో మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

కంపెనీ ప్రతినిధులతో కమిషనర్ సంప్రదింపులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బయోగ్యాస్‌ప్లాంట్ ఏర్పాట్లకు మున్సిపల్ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆమేరకు సోమవారం బెంగళూరు కు చెందిన బయోగ్యాస్ ప్లాంట్ ప్రతినిధుల బృందం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిశారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం పట్టణంకు 4 కిలోమీటర్ల దూరంలో వున్న కంపోస్టు యార్డును పరిశీలించారు. ప్రతిరోజు ఇక్కడ తడి చెత్త ఎంతమేరకు ఉత్పత్తి అవుతుంది అనేది వివరాలు కోరారు. అలాగే ఇక్కడ బయోగ్యాస్ ఉత్పత్తి అయ్యాక ఇక్కడ గ్యాస్ విక్రయాలకు వున్న మార్కెట్ ఎలావున్నది ఆరా తీశారు. ఇందుకు కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతు ప్రొద్దుటూరు జమ్మలమడుగు మైదకూరు ఎర్రగుంట్ల కమలాపురం మున్సిపాలిటీలనుంచి తడిచెత్త ప్రతి రోజు 100 టన్నులు తక్కువ కాకుండా ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఇక్కడ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన 6 ఎకరాల స్థలం కంపోస్టు యార్డులోనే ఇవ్వగలమన్నారు. అన్నీ పరిశీలించి ప్లాంట్ పెట్టడానికి ముందుకు వస్తే అన్ని వసతులు కల్పిస్తామన్నారు.త్వరలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటైతే తడి వ్యర్థాల నుంచి గ్యాస్ ఉత్పత్తి తక్కువ ధరకే బయోగ్యాస్ కూడా అందుబాటులోకి రాగలదని కమిషనర్ తెలిపారు.

విద్యుత్తు అధికారులపై రైతుల ఆగ్రహం

దువ్వూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందిపై సోమవారం ఆశాఖ డివిజన్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ ఎదుట మండల రైతులు ఆగ్రహం తెలిపారు. రైతులను పీడించి లంచాల రూపంలో డబ్బులు పిండుకుంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోకుండా తాత్కాలిక చర్యలు తీసుకోవడం ఏమిటని అధికారిని ప్రశ్నించారు లైన్‌మెన్ యూనియన్ లీడర్ అని, ఉన్నతాధికారులు సైతం భయపడి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

నలుగురు జూదరుల అరెస్టు

రూ.3550 నగదు స్వాధీనం

పోరుమామిళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3550 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. సోమవార శీనప్పబావి వీధి దగ్గర ఉన్న కంపచెట్లలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడులు చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి సహకరిస్తాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న కోర్టు భవనాలను నిర్మించుకోవడానికి సహకరిస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టులో చాలా కాలంగా భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. భవనాలను నిర్మించడానికి రూ.6 కోట్లు అవసరమని కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం చేపట్టాలని సూచించారు. బిల్లులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తామని తెలిపారు. కోర్టులో అడిషనల్ సబ్‌కోర్టును త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి గురప్ప, కాశీం, న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, గొర్రె శ్రీనివాసులు, దాదాపీర్, కొండారెడ్డి, సుమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









బీసీ కులగణన రాష్ట్ర కన్వీనరుగా బీసీ రమణ

బద్వేలు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణన రాష్ట్ర కన్వీనరుగా బద్వేలు పట్టణానికి చెందిన బీసీ రమణను ఎన్నుకున్నారు. ఇటీవల విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో బీసీ కులగణన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బీసీ సమన్వయ కమిటి ప్రధానంగా బీసీ కుల జన గణన కోసం ఉద్యమిస్తుందని అలాగే బీసీ సమస్యల పై కూడా పోరాటాలు సాగిస్తుందని తెలిపారు.

పన్నులు కట్టకపోతే చర్యలు

- నీటి కుళాయి కనెక్షన్ కట్

ఎర్రగుంట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, నీటి పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్లి శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుకు గడువు ముగుస్తున్నందున పన్నులు చెల్లింపుదారులందరూ సమీపంలోని సచివాలయం, నగర పంచాయతీ కార్యాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పన్నులు చెల్లించకపోతే నీటి కుళాయి కనెక్షన్ తొలగించడంతోపాటు, ఏపీ మునిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రతి కార్యకర్తనూ ఆదుకుంటాం

●ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



మైదుకూరు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన ప్రతి కార్యకర్తను టీడీపీ ఆదుకుంటుందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు.స్థానిక బద్వేల్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ముఖ్యమంత్రి సహాయక నిధి నుంచి సుమారు 15 లక్షల రూపాయల చెక్కులను 17 మంది అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన,ప్రమాదాలలో చనిపోయిన, గాయపడిన వారికి అందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, బీపీ సుధాకర్‌రెడ్డి,ఏపీ రవీంద్ర, బీఎస్ శ్రీనివాసులు,యాపరాలచిన్న, ఆర్‌శ్రీనివాసులు, బురుగోళ్ల చిన్న పాల్గొన్నారు. **ఖాజీపేట..:** మండల పరిధిలోని అప్పనపల్లె పంచాయతీలోని మల్లాయపల్లెకు చెందిన అమ్మనికి రూ.50 వేలు చెక్కును, బోసిరెడ్డిపల్లెకు చెందిన పుల్లారెడ్డికి రూ.81 వేలు చెక్కును సీఎం సహాయ నిధి కింద రూ.1.31 లక్షలు చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 12,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ డీఈఈ నరసింహ మూర్తి సోమవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 14 వేల క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుం డటంతో పెన్నాకు 12,300 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 74 క్యూసెక్కులు, దక్షిణకాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం : కేసు నమోదు


అట్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని తంబళ్లగొంది దళితవాడకు చెందిన డిగ్రీ విద్యార్థి ని మద్దూరు నాగస్వరూప(22) ఆదివారం కనిపించడంలేదంటూ తండ్రి సుబ్బ రాయు డు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గ్రామానికి చెందిన బంగారు పల్లె వెంగయ్యపై అనుమానం ఉన్నట్లు విద్యార్థి ని తండ్రి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

జైలు శిక్ష

బద్వేలుటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యంతాగి హల్‌చల్‌లేసి వాహనం నడిపిన డ్రైవర్ బత్తల రమేష్‌కు బద్వేలు అడిషనల్ జూనియర్ సివిల్‌కోర్టులో 7రోజులు శిక్ష విధించినట్లు అర్బన్‌సీఐ రాజగోపాల్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కాశినాయన మండలం అమగం పల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ రమేష్ మద్యంతాగి వాహనం నడుపుతుండటంతో తనిఖీల్లో గుర్తించారు. సదరువ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా 7 రోజులు శిక్షవిధించినట్లు ఆయన తెలిపారు.

నూతన భవనంలోకి ఎస్‌బీఐ

ఎర్రగుంట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రాణీవనం ప్రొద్దుటూరు రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను కడప రోడ్డులోని రెడ్డి నగర్‌కు ఎదురుగా నూతనంగా నిర్మించిన భవనంలోకి తరలించారు. కాగా సోమవారం నుంచి అన్ని సేవలు ఈ బ్రాంచి నుంచే నిర్వహిస్తున్నట్లు చీఫ్ మేనేజర్ కే.రామారావు తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం గమనించాలని ఆయన కోరారు.



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఓపెన్‌స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ గా సాంబశివారెడ్డి

కొండాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ గా బోడేల సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్‌లో హెడ్మాస్టర్‌గా పని చేస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఆయనను ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ గా నియమించారు. సోమవారం డీఈవో ఆఫీసులో ఏడీ మునీర్‌ఖాన్ సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా 30వ తేదీ బుధవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. ఉదయం స్వామివారికి రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి పూజలు నిర్వహించి అలంకరిస్తామన్నారు. అనంతరం హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

టపాసుల అంగళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మోడంపల్లె బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్న టపాసుల అంగళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీవైఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ టపాసు అంగళ్లు ఏర్పాటు చేసే చోట ఒక జూనియర్ కళాశాల, ఒక పాఠశాలతోపాటు సమీపంలోనే సబ్‌స్టేషన్ ఉందన్నారు. ఆ రోడ్డు భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుందని, దుకాణాల నిర్వాహకులు కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. రమేష్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి

మైలవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం మైలవరం పోలీస్‌స్టేషన్ లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, ఆయుధాల పరిశీలన, లాకప్, స్టేషన్ నిర్వహణ తెలుసుకోవాల్సిన పలు చట్టాలపై వారికి అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగసముద్రంలో భూవివాదం


ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

పోరుమామిళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగ సముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నెం.227లో సుమారు 41 ఎకరాలు వంక పోరంబోకు పొలం ఉండేది. అందులో 23 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు సమాచారం. అయితే 2010లో ఆ సర్వే నెంబరులో ఆర్మీ కోటా కింద ఆర్మీ ఉద్యోగి సయ్యద్‌హుస్సేన్‌కు 4.40 ఎకరాలు నమోదు అయినట్లు తెలిసింది. అయితే సోమవారం సయ్యద్‌హుస్సేన్ తమ బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లడంతో రంగసముద్రం గ్రామా నికి చెందిన స్థానికులు అడ్డు చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం పోలీసు అధికారులకు తెలియ డంతో సమస్యను సద్దుమణిగేలా చేశారు. తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి వీఆర్వో ఓబయ్యను సంఘటనా స్థలానికి పంపించి వివరాలు ఆరా తీశారు. ఇరువర్గాల వారితో ఆయన మాట్లాడి రికార్డులు పరిశీ లించి ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతామన్నారు. అంతవరకు ఏ ఒక్కరూ భూమిలో దిగరాదని ఆదేశాలు జారీ చేశారు.

వీరజవాను కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేశ్ ఇటీవల ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో మావోయిస్టులు జరిపిన బాంబు దాడిలో వీరమరణం చెందిన సంగతి విధితమే. ఈ నేపధ్యంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం రాజేశ్ స్వగ్రామానికి వెళ్లి అక్కడ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో బి.మఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి,ఎల్లటూరు సాంబశివారెడ్డి,ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, కాణాల మల్లికార్జునరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, చిలమల నారాయణ, చిలమల నాగయ్య, రామసుబ్బారెడ్డి, వీరయ్య, సూరి, శ్రీను, రమేశ్, నరసింహగౌడ్, రమణ, బాలదుగ్గిరెడ్డి, తహసీల్దారు దామోదర్ రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, పాల్గొన్నారు.

OFFICE OF THE SUPERINTENDENT, GOVT. GENERAL HOSPITAL
YSR DISTRICT: KADAPA

RC.No.4650/GI/GGH/2024, DT: 28-10-2024

TENDER NOTIFICATION

Sealed Tenders are Invited from the manufactures/authorized Dealer / Registered Suppliers for supply of equipment to the GGH, Kadapa.

S.No.	NAME OF THE EQUIPMENT	QUANTITY
01.	HORIZANATAL AUTOCLAVE-250 LTS., (MAKE-REICO, CISTRON, NAT STEEL)	1

The Tender Forms and list of items along with terms and conditions can be obtained from the office of the Superintendent, Govt. General Hospital, Kadapa on payment of **Rs. 1000.00** by way of **demand draft** taken in any nationalized bank payable at Kadapa in favour of the **Convenor, HDS, Govt. General Hospital, Kadapa** in person on any working day from 10.30 A.M. to 5 P.M.

Date of Issue of Tender Forms	--	29-10-2024 to 05-11-2024
Date of Receipt of Tender forms	--	29-10-2024
Last date for submission of Tenders	--	05-11-2024 - upto 2 p.m.
Opening Tenders	--	05-11-2024 at 4 p.m.

SUPERINTENDENT Govt. General Hospital Kadapa — **Sd/- JOINT COLLECTOR / CHAIRMAN** District Purchase Committee, Kadapa.

స్వాహా చేసిన డబ్బుపై నేడు విచారణ

చాపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన హనీఫ్ బాష స్వాహాచేసిన రూ.5.70 లక్షలపై జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క ఈనెల 29న మంగళవారం విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హనీఫ్‌బాష బద్రిపల్లె, వెదురూరు, పల్లవోలు గ్రామ పంచాయతీలకు సంబంధించి సుమారు రూ.5.70 లక్షలు స్వాహా చేయడం జరిగింది.

ఈ ఏడాది జనవరి నెల నుంచి ఏప్రిల్ వరకు విడతల వారీగా సర్పంచులకు, అధికారులకు తెలియకుండా డబ్బులు స్వాహా చేశాడు. అధికారులు హనీఫ్ బాషను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

జ్ఞానజ్యోతి వెలుగులు ప్రతి ఇంటిలో వెలగాలి

జమ్మలమడుగు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి జ్ఞానజ్యోతి వెలుగులు ప్రతి ఇంటిలో వెలగాలని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో భగవద్గీత ప్రచారం చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

బద్వేలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని భాకరా పేట అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. ఒకవైపు మున్సిపాలిటీ వారు వేసే ఇంటి, కుళాయిపన్నులు కడుతున్నప్పటికీ వారికి మౌలిక సదుపాయలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. సోమవారం సీపీఐ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటరమణ, పీవీ.రమణ, మునిరత్నం, రమణ, నాగరాజు పాల్గొన్నారు.